
సాక్షి
చిత్తూరు
ఆదివారం । 21 । మే । 2023



మము పాలింపగ తరలివచ్చితివా..
కార్వేటినగరంలోని వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో శనివారం రథోత్సవం నేత్రపర్వంగా జరిగింది. -8లో



నేటినుంచి యాదమరిలో బ్రహ్మోత్సవాలు
యాదమరి ఇంద్రవరదరాజస్వామి బ్రహ్మోత్సవాలకు నేడు విష్వక్సేన ఉత్సవం, అంకురార్పణ జరుగనుంది. -8లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	39	26
తిరుపతి	41	27
తిరుమల	36	23
గూడూరు	41	29
నగరి	41	28

పశువులకు పునర్జన్మ

లేవలేని, నడవలేని మనుషులను ఆస్పత్రులకు తీసుకెళ్లాలంటేనే ఎంతో కష్టం. అలాంటిది పశువులకు జబ్బు చేస్తే ఇక దాని వేదన వర్ణనాతీతం. అసలే మూగ జీవి పైగా అనారోగ్యం. కదల్లేని స్థితిలో పశువును ఆస్పత్రికి తీసుకెళ్లాలంటే రైతుకూ కష్టతరం. ఇలాంటి కష్టాలకు స్వస్తి పలికేందుకు ప్రభుత్వం కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. డాక్టర్ వైఎస్సార్ సంచార పశు వైద్య సేవ పేరుతో పశు అంబులెన్స్‌లు ప్రవేశ పెట్టింది. తద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న మూగజీవాలకు సకాలంలో వైద్యం అందిస్తోంది. పశువులకు పునర్జన్మను ప్రసాదిస్తోంది.



సంచార పశు ఆరోగ్యసేవ వాహనాలు ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి (ఫైల్)

- జిల్లా వ్యాప్తంగా 14 పశు అంబులెన్సులు
- సత్ఫలితాలిస్తున్న సంచార పశు వైద్యశాలలు
- సేవలకు టోల్ ఫ్రీ నంబరు 1962

సాక్షి, చిత్తూరు: గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు పాడి పంటలే ప్రధాన ఆదాయ వనరులు. వ్యవసాయానికి అనుబంధమైన పాడి పరిశ్రమ రైతుకు అండగా నిలుస్తోంది. అయితే రోగాల బారిన పడిన పశువులను సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లలేకపోవడంతో అవి మృత్యువాత పడుతుండేవి. ఈ నేపథ్యంలోనే పశుసంపద పరిరక్షణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రత్యేకంగా సంచార వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. జబ్బుపడిన పశువులను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు అంబులెన్సులను తీసుకొచ్చింది. జిల్లాలోని 7 శాసనసభ నియోజకవర్గాలకు 14 అంబులెన్సులను ఏర్పాటు చేసి వాటిలో పశువైద్య సిబ్బందిని నియమించింది. ఫలితంగా రైతు ఇంటి వద్దనే సకాలంలో



పశు వైద్య సంచార వాహనం

మూగజీవాలకు వైద్యం అందుతోంది. ఫలితంగా మూగజీవాల మరణాల శాతం తగ్గింది.

గ్రామీణ ప్రాంతాల్లో పశు వైద్యశాలల కొరత అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ సంచార వైద్య శాల(అంబులెన్స్)లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ వాహనంలో ముగ్గురు సిబ్బంది ఉంటారు. పశు వైద్యుడు, వెటర్నరీ డిప్లొమా చేసిన సహాయకుడు, డ్రైవర్ కం అటెండర్ ఉంటారు. ఈ వాహనంలోనే పశుపేడ సంబంధిత పరీక్షలు, రక్త సంబంధిత పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన మైక్రోస్కోప్ సౌకర్యంతో కూడిన చిన్న ప్రయోగశాల, అవసరమైన మందులు, కృత్రిమ గర్భధారణ సేవలు, పశువును వాహనంలోకి ఎక్కించేందుకు హైడ్రాలిక్ సౌకర్యం ఉండేలా ఏర్పాటు చేశారు.

పశువైద్యసేవలు విస్తృతం

సంచార పశు వైద్యశాలల ద్వారా పశువుకు ఉన్న చోటనే సత్వరమే పశు వ్యాధి నిర్ధారణ చేసి, వైద్యం అందిస్తారు. ఆయా ప్రాంతాల్లో పశు వ్యాధుల వ్యాప్తి, వాటి నిర్మూలన వంటి అంశాలను అంచనా వేస్తారు. కృత్రిమ గర్భోత్పత్తి సేవలు అందిస్తారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తారు. రైతులకు మరింత చేరువగా, వేగంగా పశువైద్య సేవలు అందించాలని టోల్ ఫ్రీ నెంబర్ 1962ను తీసుకొచ్చింది. ఈ నంబరుకు ఫోన్ చేసి రైతు పేరు, గ్రామం, మండలం, పశువు సమస్య వివరించాలి. కాల్ సెంటర్ నుంచి సమాచారం సంబంధిత జిల్లాలోని సంచార పశు వైద్య వాహన వైద్యులకు చేరుతుంది. ఈ సమాచారం అందిన వెంటనే పశు వైద్యుడు సంబంధిత ప్రాంతానికి వెళ్లి వైద్య సేవలు అందిస్తారు. అత్యవసర సమయాల్లో పశు వైద్య నిపుణులు సంచార పశు వైద్య వాహనంలో వచ్చి పశువును పరిశీలిస్తారు. వ్యాధి నిర్ధారణ చేసిన తర్వాత చికిత్స అందిస్తారు. అవసరమైతే హైడ్రాలిక్ లిఫ్ట్ సౌకర్యంతో పశువును వాహనంలోకి ఎక్కించి దగ్గరలోని ఏరియా పశు వైద్యశాలకు/వెటర్నరీ పాలిక్లినిక్‌లకు తరలించి పశువుకు సరైన వైద్యం అందించి ప్రాణాపాయం నుంచి రక్షిస్తారు. వైద్యం అందించిన తర్వాత మరలా ఆ పశువు రైతు ఇంటికి ఉచితంగా వాహనంలోనే చేర్చుతారు. దీంతోపాటు పశు టెలీ మెడిసిన్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసింది.

అంబులెన్స్‌లో ఏమున్నాయంటే..

- ట్రావిస్, వెయ్యి కిలోల బరువున్న మూగజీవాన్ని తరలించేందుకు వీలుగా హైడ్రాలిక్ లిఫ్ట్
- పేడ, రక్త పరీక్షలు చేసేందుకు వీలుగా మైక్రోస్కోప్‌తో కూడిన లేబొరేటరీ
- పెంపుడు జంతువులు, పక్షులకు సర్జరీ చేసే పరికరాలు
- జంతువులకు అవసరమైన వ్యాక్సిన్లు, అన్ని రకాల మందులు

పశు వైద్య సేవలు ఉపయోగించుకోండి



డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ అంబులెన్సులు జిల్లాలో నియోజకవర్గానికి రెండు చొప్పున 14 ఏర్పాటు చేశా ము. ఇవి అవసరమైన చోట పాడి పశువులకు అవసరమైన వైద్య సేవలను అందిస్తున్నాయి. ఈ సంచార వాహనాల ద్వారా పశు వైద్య సేవలను ఉపయోగించుకోవాలి.

– సగిలి షణ్మోహన్, కలెక్టర్, చిత్తూరు

వైఎస్సార్ పశు ఆరోగ్య సేవ ఎంతో ఉపయోగకరం



మా దూడకి ఆరోగ్యం బాలేదని 1962 నంబర్‌కి కాల్ చేశాము. కాల్ చేసిన పది నిమిషాలకి అంబులెన్స్ వచ్చింది. వైద్యులు మా దూడకి వైద్యం చేశారు. ప్రస్తుతం మా దూడ చాలా ఆరోగ్యంగా ఉంది. ఈ వాహనం పశువులను పెంచే రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంది. పైగా ఖర్చు కూడా లేదు.

– విఘ్నేష్, తవణంపల్లె

పాడి రైతులకు అండగా



ఈ అంబులెన్సులు పాడి రైతులకు ఎంతో ఉపయోగకరం. ఈ వాహనంలో ఆధునిక సౌకర్యాలతో కూడిన అంబులెన్స్ మా ఊరికి తరచూ వస్తోంది. రైతులు కూడా ఇప్పుడు పశువులకు జబ్బు చేస్తే 1962కి ఫోన్ చేస్తున్నారు. ఇలాంటి సదుపాయం పొందడం నిజంగా అదృష్టమే.

– నగేష్ కుమార్, పుంగనూరు

7642 పశువులకు సేవలందించాం



పశువులకు వైఎస్సార్ సంచార పశు వైద్యసేవ ద్వారా సకాలంలో వైద్య సేవలు అందిస్తున్నాము. ఇప్పటి వరకు మొత్తం 7,642 పశువులకు సంచార వాహనాల ద్వారా వైద్య సేవలందించాం. ఇందులో చిత్తూరు– 1223, జీడీ నెల్లూరు– 1202, కుప్పం–969, నగరి–1217, పలమనేరు– 1574, పుంగనూరు–643, పూతలపట్టు మండలంలో 814 మూగజీవాలకు వైద్య సేవలు అందించాం.

– డాక్టర్ ఎం.ప్రభాకర్, జిల్లా పశు సంవర్ధక శాఖ

న్యూస్‌రీల్

జూలైలో టిడ్కో గృహాలు ప్రారంభం



పనులను పరిశీలిస్తున్న చైర్మన్ ప్రసన్నకుమార్, నరసింహప్రసాద్, నాగభూషణం

పుంగనూరు: మున్సిపల్ పరిధిలో నిర్మించిన టిడ్కో గృహాలను జూలై మొదటి వారంలో ప్రారంభించేలా కసరత్తు చేస్తున్నట్లు రాష్ట్ర టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్ వెల్లడించారు. శనివారం కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, జానపద కళల సంస్థ రాష్ట్ర చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్‌తో కలసి ఆయన టిడ్కో గృహాలను సందర్శించారు. రోడ్లు, కాలువలు, విద్యుత్, పైపులైన్ల పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచనల మేరకు ప్రారంభోత్సవ తేదీని నిర్ణయిస్తామన్నారు. ఈలోపు పెండింగ్‌లో ఉన్న జీఎల్ఎస్ఆర్ ట్యాంకులు, ప్రహరీని త్వరలోనే పూర్తి చేయాలని, విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీలో 1,536 మందికి ఇళ్లు కేటాయించామన్నారు. గత ప్రభుత్వంలో లబ్ధిదారులు ధరావత్తుగా చెల్లించిన రూ.60 లక్షల నగదును వారికి వాపస్ ఇస్తామని తెలిపారు. టిడ్కో గృహాలు ఎంతో సుందరంగా నిర్మించామన్నారు. ఈయన వెంట ఈఈ వెంకటముని, డీఈఈ బలరామయ్య, మున్సిపల్ డీఈఈ మహేష్, కౌన్సిలర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ పరీక్షలో ప్రతిభ




కుటుంబ సభ్యులతో రాష్ట్ర స్థాయి ర్యాంక్ సాధించిన చిత్తూరు విద్యార్థి గణేష్

చిత్తూరు కలెక్టరేట్ : పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. జిల్లాలో బంగారు పాళ్యం మండలానికి చెందిన పవన్‌సాయి 162వ ర్యాంక్, చిత్తూరు గంగనపల్లెకు చెందిన గణేష్ 350, కుప్పానికి చెందిన చరణ్ దీప్ 581వ ర్యాంక్ సాధించారు. చిత్తూరు గంగనపల్లెకు చెందిన చంద్రశేఖర్, ఈశ్వరీ కిరణ్‌ల కుమారుడు గణేష్ 120 మార్కులకు గాను 110 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 350 వ ర్యాంక్ సాధించాడు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా శనివారం ఏపీఆర్ఎస్‌క్యాట్, ఏపీఆర్‌జేసీ, ఏపీఆర్‌డీసీ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లాలోని 14 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరిగాయని అధికారులు వెల్లడించారు. ఏపీఆర్ ఎస్ క్యాట్ పరీక్షకు 1432 మంది విద్యార్థులకు గాను 1141 మంది హాజరయ్యారు. ఏపీఆర్ జేసీ పరీక్షకు 1862 మందికి 1490 మంది హాజరుకాగా, ఏపీఆర్‌డీసీ పరీక్షకు 28 మందికి గాను 24 మంది హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. పలు పరీక్ష కేంద్రాలను డీవైఈవో చంద్రశేఖర్, కోఆర్డినేటర్ వేణుగోపాల్, ఏసీ గురుస్వామి రెడ్డి పర్యవేక్షించారు.

జగనన్న విద్యాకానుక పరిశీలన



కానుకలను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ వెంకటకృష్ణారెడ్డి

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో భద్రపరచిన జగనన్న విద్యా కానుకను శనివారం కడప ఆర్‌జేడీ వెంకటకృష్ణారెడ్డి పరిశీలించారు. యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, షూ తదితర వివరాలను ఆరా తీశారు. స్టాక్ ఎంత ఉంది..ఇంకెంత రావాలి అనే వివరాలను తెలుసుకున్నారు. ఎంఈఓ సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాబుకు రాజకీయ సమాధి తప్పదు

- ఇళ్ల స్థలాలను సమాధులతో పోల్చడం దారుణం
- ఊసరవెల్లి కంటే చంద్రబాబు డేంజర్
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం) : పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను సమాధులతో పోల్చిన చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో ప్రజలు రాజకీయ సమాధి కట్టడం తథ్యమని డిప్యూటీ సీఎం నారాయణస్వామి పేర్కొన్నారు. శనివారం కొత్త వెంకటాపురంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదల అభివృద్ధి కోసం, పేదల జీవన విధానం మారాలని పూరి గుడెసెల నుంచి విముక్తి కలిగించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల స్థలాలు, నిర్మాణాలు చేపడుతుంటే వాటిని చంద్రబాబు సమాధులతో సమానాలతో పోల్చిడం నీచమైన చర్య అని మండిపడ్డారు. పేదలకు ఒకటిన్నర సెంటు స్థలం కేటాయించి, ఇళ్ల నిర్మాణాలు చేపడుతుంటే ఓర్వలేక వక్రీకరిస్తూ బురదచల్లేందుకు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార దాహంతో ప్రతి ఒక్కటీ వక్రీకరిస్తే పేదలు చూస్తూ ఊరుకోబోరని హెచ్చరించారు. చంద్రబాబు నాలుక నిజాలను ఎప్పుడూ పలికింది లేదని, బాబు ఊసరవెల్లి కన్నా ప్రమాదకారి అని, మాటలు మార్చడం, అబద్దాలు చెప్పడమే బాబు సంస్కృతి అని ఆరోపించారు.

నిజాలు రాయని ఎల్లోమీడియా

చంద్రబాబుకు అమ్ముడుబోయిన ఎల్లో మీడియా నిజాలు రాయవని డిప్యూటీ సీఎం నారాయణస్వామి విమర్శించారు. మార్గదర్శి ముసుగులో రామోజీ రూ.కోట్ల అవినీతికి పాల్పడినట్లు సీబీఐ వెల్లడించినా ఎల్లో మీడియాలో ఎందుకు వార్తలు రాలేదని ప్రశ్నించారు. కరకట్టపై ఇల్లు, అమరావతి భూ కుంభకోణం, స్కిల్ డెవలప్‌మెంట్ తదితరాల్లో అవినీతికి పాల్పడినా కనీసం ఒక్క అక్షరమైనా రాసారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే కనివిని ఎరగని రీతిలో చరిత్రలో నిలిచి పోయేలా 31 లక్షల ఇళ్ల స్థలాలు ఇవ్వడం, ఇంటి నిర్మాణాలు చేపట్టడం నేరమా ..? అని ప్రశ్నించారు. పేదల అభివృద్ధి పథకాలపై విష ప్రచారం చేస్తే ప్రజలు ఊరుకోరని, రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని నారాయణస్వామి పేర్కొన్నారు.

నేతన్నకు ప్రభుత్వం అండ



పూల వర్షంతో మంత్రి రోజాను ఆహ్వానిస్తున్న చింతలపట్టెడ వాసులు

నగరి : నేతన్నకు తమ ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. మున్సిపల్ పరిధిలో నేత కార్మికులు అధికంగా నివసించే చింతలపట్టెడలో శనివారం ఆమె గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. నేతన్నలకు ప్రభుత్వ పాఠశాలల యూనిఫామ్ ఆర్డర్లు కేటాయించడం, ఆధునిక యంత్రాలను పరిచయం చేయడం, గత ప్రభుత్వం మార్చిన మరమగ్గాల విద్యుత్ కేటగిరీని మళ్లీ పాత పద్ధతికే సవరించి మంత్రి ఆర్కేరోజా అండగా నిలిచిన సంగతి విదితమే. దీంతో మంత్రిని చింతలపట్టెడ వాసులు పూల వర్షంతో ఆహ్వానించడం ప్రత్యేకతను సంతరించుకుంది. పథకాలు వర్తించాయా లేదా అని లబ్ధిదారులను ఆరాతీశారు. స్థానికులు మంత్రి దృష్టికి తెచ్చిన సమస్యలను వెంటనే పరిష్కారించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్ బాలన్, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, వైఎస్సార్ సీపీ మున్సిపల్ అధ్యక్షుడు బీఆర్వీ అయ్యప్పన్, మండల సచివాలయ కన్వీనర్ దయానిధి, కౌన్సిలర్ నళిని, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

పకడ్బందీగా హైస్కూల్ ప్లస్ టీచర్ల కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని హైస్కూల్ ప్లస్ టీచర్ల పోస్టింగ్‌ల కౌన్సెలింగ్ శనివారం పకడ్బందీగా నిర్వహించారు. ఈ ప్రక్రియను వైఎస్సార్ కడప జిల్లా ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి, డీఈవో విజయేంద్రరావు పర్యవేక్షించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని 66 మండలాల నుంచి దరఖాస్తు చేసుకున్న స్కూల్ అసిస్టెంట్‌లు హాజరయ్యారు. 236 పోస్టుల భర్తీకి అధికారులు కసరత్తు నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 35 హైస్కూల్ ప్లస్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. చిత్తూరు జిల్లాలో 16, తిరుపతి జిల్లాలో 11, అన్నమయ్య జిల్లాలో 8 పాఠశాలల్లో హైస్కూల్ ప్లస్ విధానాన్ని ప్రభుత్వం గత ఏడాది ప్రవేశపెట్టింది. చిత్తూరు డీవైఈవో చంద్రశేఖర్, మదనపల్లె డీవైఈవో కృష్ణప్ప, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు

ఆధునిక సాగు పద్ధతులు అవలంబించాలి

బంగారుపాళెం: రైతులు ఆధునిక సాగు విధానాలపై అవగాహన పెంపొందించుకుని అధిక దిగుబడులు, లాభాలు ఆర్జించాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ సూచించారు. మండలంలోని చీకూరుపల్లె రైతు భరోసా కేంద్రంలో శనివారం రైతులకు డ్రోన్‌తో ఎరువులు, మందులు స్ప్రేపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సాగులో డ్రోన్‌ల వినియోగం ద్వారా కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. పంటలకు డ్రోన్ ద్వారా మందులను ఏ విధంగా పిచికారీ చేయాలో అవగాహన కల్పించారు. గతంలో వ్యవసాయ పనులకు కూలీలు పెద్ద సంఖ్యలో వచ్చేవారని, ప్రస్తుతం అలాంటి పరిస్థితులు తగ్గుతున్నాయన్నారు. ఈ పరిస్థితులను అధిగమించేందుకు సాగులో ఆధునిక పద్ధతులు, విధానాలు అందుబాటులోకి వచ్చాయని



డ్రోన్‌తో ఎరువుల పిచికారీపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

తెలిపారు. కూలీల సంఖ్యను తగ్గించేందుకు నూతన యాంత్రీకరణ పద్ధతులను రైతులు అవలంబించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ పంటలు, ఉద్యాన పంటల చీడపీడల నివారణకు డ్రోన్ ద్వారా మందులు పిచికారీ చేసుకోవచ్చని తెలిపారు. మండలంలో కిసాన్ డ్రోన్ పథకం కింద తుంబకుప్పం, రాగిమానుపెంట, పాలేరు గ్రామ పంచాయతీలు పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైనట్లు తెలిపారు. డీఆర్‌సీ గోపాల్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో సాగు చేయాల్సిన పంటలు, యాజమాన్య పద్ధతులను వివరించారు. అనంతరం జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ చీకూరుపల్లె, నలగాంపల్లె రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఈకార్యక్రమంలో ఏడీఏ మధుసూదన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి పద్మజ, విస్తరణాధికారి సాదరయ్య, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


గుర్తు తెలియని మృతదేహం

పుత్తూరు రూరల్: పుత్తూరు మరాఠి గేటు సమీపంలోని రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని శనివారం ఉదయం గుర్తించినట్లు స్థానిక ఆర్పీఎఫ్ ఏఎస్ఐ పరశురామ్ తెలిపారు. మృతుడు లుంగీ, తెల్ల చొక్కా ధరించి ఉన్నాడని, వయస్సు 55 ఏళ్లు ఉండవచ్చని పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు రైలు కింద పడి మృతి చెందినట్లు భావిస్తున్నామని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

నేటినుంచి ఇంద్రవరదరాజస్వామి బ్రహ్మోత్సవాలు

- నేడు విష్వక్సేన ఉత్సవం, అంకురార్పణ
- జూన్ 1వ తేదీ వరకు
  వివిధ వాహనాలపై స్వామివారి విహారం


యాదమరిలో వెలసిన ఇంద్రవరదరాజస్వామి ఆలయం

యాదమరి: మండల కేంద్రంలోని ఇంద్రవరదరాజ స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. గంగా, యమున, సరస్వతి మూడు నదులు కలిసే త్రివేణి సంగమంలో పడమర వైపు ముఖద్వారంతో స్వయానా ఇంద్రుడే ఇక్కడి ఆలయం నిర్మించినట్లు పురాణ కథనం. కోర్కెలు తీర్చే దేవుడిగా ఇంద్రవరదరాజస్వామి నీరాజలందుకుంటున్నారు. జూన్ 1వ తేదీ వరకు జరుగునున్న బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది.

భక్తురాలి కోసం ఆలయం

పడమటి దేశానికి చెందిన ఇంద్రుని భక్తురాలు తమిళనాడులోని కంచి వరదరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో ఏటా గరుడసేవకు వెళ్లి స్వామివారిని దర్శించుకునేది. నిండు గర్భిణిగా ఉన్న సమయంలో ఆమె కంచి వరదుని బ్రహ్మోత్సవాల్లో గరుడసేవకు వస్తుండగా యాదమరి వద్ద పురిటి నొప్పులు మొదలయ్యాయి. గాలీవాన నడుమ ఆమె పొదలచాటున పండంటి మగ బిడ్డకు జన్మనిస్తుంది. అయితే గరుడసేవను దర్శించుకోలేక పోయానని భక్తితో ఆమె ఇంద్రుడిని ప్రార్థిస్తుంది. అక్కడే వరదరాజస్వామి గరుడ వాహనంపై ప్రత్యక్షమయ్యాడని, ఆ స్థలంలో ఇంద్రుడే ఇంద్రవరదుని ఆలయం నిర్మించినట్లు పురాణగాథ.

యాదపోద నుంచి యాదమరిగా....

భక్తురాలి కోసం యాదపోద ఉన్న చోట ఆలయాన్ని ప్రతిష్ఠించడంతో ఇంద్రపురిగా పేరొచ్చింది. కాలక్రమంలో యాదమరిగా రూపాంతరం చెందింది. ఈ ఆలయానికి 2వ శతాబ్దంలో పల్లవరాజులు రాజగోపురం నిర్మించారు. 16వ శతాబ్దంలో శ్రీ కృష్ణదేవరాయుల ఆలయానికి ప్రహరీ గోడ, వాహనాల మండపం నిర్మించి, నిత్యపూజలు, వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించే వారని చరిత్ర చెపుతుంది. పురాతన కాలం నుంచి ఈ ఆలయంలో వివాహం చేసుకుంటే మొదటగా మగబిడ్డ పుడతాడని భక్తుల నమ్మకం.

నేడు అంకురార్పణ

వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం అంకురార్పణ చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం మూలస్థానంలో వెలసిన శ్రీదేవి, పెరుందేవి సమేత ఇంద్రవరదరాజుస్వామికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. అనంతరం విష్వక్సేన ఉత్సవం ఉంటుందన్నారు. సాయంత్రం బ్రహ్మోత్సవాలకు ఆగమశాస్త్ర ప్రకారం అంకురార్పణ నిర్వహించనున్నట్లు తెలిపారు. రోజుకో వాహనంపై స్వామివారు పురవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించనున్నారని పేర్కొన్నారు.

ఆదర్శ ప్రవేశాలకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఆదర్శ (ఏపీ మోడల్) స్కూళ్లలో ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో విజయేంద్రరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని ఏపీ మోడల్ స్కూల్స్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులకు గాను జూన్ 7 వ తేదీలోపు www.apms.ap.gov.in/APMS వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. బోధన ఇంగ్లిష్ మీడియంలో ఉంటుందని చెప్పారు.

అడవి దారిలో గుర్తు తెలియని శవం

విజయపురం (నగరి) : విజయపురం మండలం జగన్నాథపురం అడవికి వెళ్లే దారిలో గుర్తు తెలియని మృతదేహాన్ని శనివారం గుర్తించారు. పోలీసుల కథనం మేరకు వివరాలు.. సూరికాపురం నుంచి జగన్నాథపురం అడివికి వెళ్లే మార్గమధ్యంలో ఓ గుర్తు తెలియని యువకుడు శవాన్ని ఉపాధి కూలీలు గుర్తించారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించారు. మృతిడి వయస్సు 25 నుంచి 28 లోపు ఉంటుంది. బ్లూ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. రెండు రోజులకు ముందు సూరికాపురం పరిసర ప్రాంతాల్లో సంచరించాడని, ఊరు తిరుత్తణి అని మాత్రమే చెప్పినట్లు స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ నరేష్ తెలిపారు.

వెండి ఆభరణాల బహూకరణ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామికి చెన్నైకి చెందిన లక్ష్మి నరసింహ కుటుంబ సభ్యులు కిలో వెండి ఆభరణాలు కానుకగా అందించారు. దాత కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందించారు.

పీడియాట్రిషియన్ పోస్టుకు ఇంటార్వ్యూలు రేపు

చిత్తూరు అర్బన్: జిల్లాలోని పీడియాట్రిషియన్ పోస్టులకు సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. చిత్తూరు జిల్లా ఆస్పత్రిలో మూడు పోస్టులు, మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో ఒక్క పోస్టు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హులైన వారు ఒరిజనల్ సర్టిఫికెట్లతో వాక్ ఇన్ ఇంటార్వ్యూకు హాజరు కావచ్చని పేర్కొన్నారు.

ముందస్తు నోటీసు అందజేత

చిత్తూరు కలెక్టరేట్ : ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 31 వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. శనివారం ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు డీఆర్వో రాజశేఖర్‌కు ఈమేరకు ముందస్తు నోటీసును అందజేశారు. ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోసం నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య, జిల్లా కార్యదర్శి హరిప్రసాద్‌రెడ్డి, జిల్లా సహ అధ్యక్షుడు బాలాజీ రెడ్డి తదితరులు వెల్లడించారు.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,350
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,665
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.74,000
రిటైల్ వెండి గ్రాము	రూ.77

మము పాలింపగ తరలీవచ్చితివా..



రథంపై రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి, అశ్వవాహనంపై వేణుగోపాలుని రాజసం

కార్వేటినగరం: కార్వేటినగరంలో టీటీడీ అనుబంధంలో ఉన్న ప్రముఖ శ్రీవేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజు శనివారం రథోత్సవం కనుల పండువగా సాగింది. రుక్మిణీ, సత్యభామ సమేతుడై స్వామివారు దివ్య రథంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. తెల్లవారుజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలి వైఖానస ఆగమోక్తంగా నిత్యకైంకర్యాలు నిర్వహించారు. తొమ్మిది గంటలకు రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఉత్సవ మూర్తులను పట్టు పీతాంబరాలు, మరకత మాణిక్య, వజ్రవైఢూర్యాలు, పరిమళభరిత పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి రథంపై అధిష్టింప జేశారు. తదుపరి అశేష భక్తజనుల గోవింద నామస్మరణలు, భజన బృందాలు, చెక్కభజనలు, కోలాట ప్రదర్శనలు, మంగళ వాయిద్యాల నడుమ పురవీధుల్లో రథోత్సవం సాగింది. భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి రథంపై మిరియాలు, ఉప్పును చల్లుతూ స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. 11 గంటల నుంచి 12 వరకు ఆలయంలో ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా సాగింది. సాయంత్రం 6.30 గంటలకు ఊంజల్ సేవలో స్వామి, అమ్మవార్లు సేద తీరారు. అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులు వీక్షించి తన్మయత్వం చెందారు. రాత్రి అశ్వ వాహనంపై స్వామివారు నగరవీధుల్లో విహరించారు. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో మోహన్, సూపరింటెండెంట్ రమేష్‌బాబు, ఆలయాధికారి సురేష్‌కుమార్, కంకణబట్టు గోపాలాచారి పాల్గొన్నారు.

నేడు చక్రస్నానం

బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన చక్రస్నానం ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 10.30 గంటల మధ్య స్కంధ పుష్కరిణిలో నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. వేకువజామున 4.30 నుంచి 6 గంటల వరకు పల్లకీ ఉత్సవం, 8.30 గంటల నుంచి 10 వరకు పుష్కరిణి వద్ద రుక్మిణీ,సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామి, చక్రతాళ్వార్‌కు స్నపన తిరుమంజనం జరుగుతుంది. తదుపరి చక్రతాళ్వార్‌కు అవభృథస్నానం నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 నుంచి 7 గంటల నడుమ ధ్వజావరోహణం జరగనుంది. దీంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయని సురేష్‌కుమార్ తెలిపారు.